క్లుప్తంగా

మినరల్ వాటర్ మెషీన్ వితరణ



సామర్లకోట అర్బన్ హెల్త్ సెంటర్‌కు మినరల్ వాటర్ మెషీన్ అందజేసిన కౌన్సిలర్లు

సామర్లకోట: స్థానిక గణపతినగరం వాటర్ ట్యాంకుల రోడ్డులో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌కు గురువారం 31వ వార్డు కౌన్సిలర్ పాగా సురేష్ కుమార్, పాగా శిరీష దంపతులు మినరల్ వాటర్ మెషీన్‌ను అందజేశారు. పాగా సీతారామయ్య చారిటబుల్ ట్రస్టు సభ్యురాలు పాగా వెంకటలక్ష్మి జన్మదినం సందర్భంగా దీనిని అందజేశారు. వార్డు కౌన్సిలర్ రెడ్నం సునీత, డాక్టర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం వ్యాన్ బోల్తా



వేట్లపాలెం సమీపం కెనాల్ రోడ్డులో బోల్తా పడిన వ్యాను

సామర్లకోట: స్థానిక కెనాల్ రోడ్డులో వేట్లపాలెం వైపు వెళ్తున్న బియ్యం లోడుతో ఉన్న వ్యాన్ గురువారం బోల్తా పడింది. వర్షపు చినుకులు పడుతూ ఉండటం, ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో బ్రేక్ వేసిన వెంటనే వ్యాన్ బోల్తా పడింది. రోడ్డుకు అడ్డుగా వాహనం పడి పోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన



వేట్లపాలెంలో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీలలిత

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం, చంద్రంపాలెం పోలింగ్ స్టేషన్లను ఎంపీడీఓ డి.శ్రీలలిత గురువారం తనిఖీ చేశారు. చంద్రంపాలెంలో 4వ వార్డు, వేట్లపాలెంలోని 14వ వార్డు సభ్యుల పదవులకు శనివారం ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ మేరకు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఎలిమెంటరీ పాఠశాలలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఎన్నికలను పురస్కరించుకుని శుక్రవారం గ్రామ పంచాయతీల్లో సెలవు ప్రకటించినట్టు ఎంపీడీఓ తెలిపారు. గురువారం సాయంత్రంతో ప్రచారానికి గడువు ముగిసిందన్నారు. ఎన్నికలు సజావుగా ప్రశాంతంగా జరగడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మోసే, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేసిన జిల్లా నోడల్ అధికారి ఏసుబాబు

సామర్లకోట: శిక్షణతో అనేక కొత్త విషయాలు తెలుస్తాయని, ప్రతి ఒక్కరూ శిక్షణపై పూర్తి బాధ్యతతో వ్యవహ రించి సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నోడల్ అధికారి, కాకినాడ కార్పొరేషన్ ఏఓ ఎం.ఏసుబాబు అన్నారు. స్థానిక టీటీడీసీలో కాకినాడ కార్పొరేషన్, తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలు, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీల సచివాలయ కార్యదర్శులకు ఇస్తున్న 3వ బ్యాచ్ శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఫ్యాకల్టీ శ్రీకైలాస్ శిక్షణ నిర్వహించగా మున్సిపాలిటీల నోడల్ అధికారులు సీహెచ్ సుజాత, యు.జ్యోతి రామ్, ఎస్వీ రామారావు, కె.శ్రీనివాసరావు, కేపీ ప్రసన్న పాల్గొన్నారు. కార్యదర్శులకు ఏసుబాబు సర్టిఫికెట్లు అందజేశారు.

అక్రమ మైనింగ్ ఆపాలి

పెద్దాపురం: రామేశంపేట అక్రమ మైనింగ్ ఆపాలని కోరుతూ ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఆనూరులో గురువారం రైతుకూలీలతో కలసి ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో దేశెట్టి సురేష్, పైడిమళ్ల నాగరాజు, వీరబాబు, సూరిబాబు, లోవరాజు, రాంబాబు రైతుకూలీలు పాల్గొన్నారు.

కొండెవరంలో టీడీపీ ఇంటింటా ప్రచారం

కొత్తపల్లి: మండలంలోని కొండెవరంలో గురువారం మాజీ ఎమ్మెల్యే వర్మ మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు అనిసెట్టి సత్యానందరెడ్డి, గాది రాజుబాబు, దుళ్ల సత్తిబాబు, వేమగిరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో.. పట్టించుకో!



పెద్దాపురం ఒకటో వార్డులో చేతికి అందేంత ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

పెద్దాపురం: ఇటీవల విద్యుదాఘాతంతో గాయపడుతున్న, ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండడం విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం ఈ ఘటనలకు ప్రధాన కారణం. పట్టణ నడిబొడ్డులోనే ఈ పరిస్థితి ఉంటే అంతకంటే ఆ శాఖ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం ఏముంటుంది? **కొత్తగా విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చినపుడు ఎత్తులోనే కట్టినప్పటికీ, కాలం గడిచే కొద్దీ వాటిలో పటుత్వం సడలి కొద్దికొద్దిగా సాగి కాస్త పొడగరి వ్యక్తులు చెయ్యి ఎత్తితే అందేంత దిగువకు వేలాడుతూ ప్రమాదకరంగా తయారవుతాయి.** అలాగే ట్రాన్స్‌ఫార్మర్లు కూడా రోడ్డుపై మళ్లీ రోడ్డు వేసినపుడు కూడా క్రమేపీ వాటి దిమ్మల ఎత్తు తగ్గిపోతూ చేతికి అందే ఎత్తులోకి వచ్చేస్తాయి. ఇటువంటి వాటిని ఎప్పటికప్పుడు గమనిస్తూ మళ్లీ వాటిని సవరించడం, అవసరమైతే తీగలను మార్చడం, ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మలు ఎత్తు చేయడం విద్యుత్ సిబ్బంది చేయాల్సిన నిరంతర కర్తవ్యం. దానిని విస్మరిస్తే కొన్ని సందర్భాల్లో ప్రాణాలకే ముప్పు రావచ్చు.

స్థానిక మున్సిపల్ సెంటర్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద, పట్టణంలో ఒకటో వార్డులోని పలు వీధుల్లో, చేతికి అందేంత ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఉండడం వల్ల ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు పిల్లలకు కూడా అందే ఎత్తులో ఉన్నందున పలుమార్లు స్తంభాలు మార్చాలని విద్యుత్ శాఖాధికారులను వేడుకున్నా సదరు సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని చేతికందేంత ఎత్తులో ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చినట్లైతే ప్రమాదాల నుంచి కొంతమందిని రక్షించినావరవుతారని స్థానికులు అంటున్నారు.



మున్సిపల్ సెంటర్‌లో నడిబొడ్డున కిందకు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఈ-క్రాప్ నమోదుతో ఎంతో మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న విజయదుర్గ

పెద్దాపురం: ఈ-క్రాప్ బుకింగ్ ద్వారా రైతులకు మంచి ప్రయోజనాలు ఉంటాయని రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ బర్రే నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కట్టమూరులో గురువారం వ్యవసాయ శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ క్రాప్ బుకింగ్, ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వ్యవసాయ సహాయకులు విజయదుర్గ అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు ద్వారా రైతులు ప్రభుత్వం నుంచి సబ్సిడీ, రాయితీలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో నల్లల గోవిందు, అడపా సుబ్రహ్మణ్యం, వీఏఏ అమృత వర్షిణి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మరిడమ్మకు మఖ నక్షత్ర పూజలు



మరిడమ్మకు పూజలు చేస్తున్న పండితులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ తల్లికి గురువారం బంగారు, వెండి పుష్పాలతో మఖ నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం



దుర్గాడలో మహిళలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- దుర్గాడలో గడప గడపకూ మన ప్రభుత్వం

పిఠాపురం: గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి 2వ వార్డు సచివాలయ పరిధి ఈబీసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటివరకూ ఏప్రభుత్వం చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేశారన్నారు. గత టీడీపీ హయాంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఒక్క పథకం కూడా అందకుండా వివక్షత చూపించారని, ప్రస్తుతం తమ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయన్నారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. తమకు ఇంటి వద్దే ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరిన మహిళలకు కుట్టు మెషీన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



పిఠాపురం రోడ్డులోని ప్రైవేటు లే అవుట్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తదితరులు

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో వాహనాల పార్కింగ్, హెలిప్యాడ్, సభ నిర్వహించే ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణాలను ఎస్పీ సతీష్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ మేరకు పిఠాపురం రోడ్డులో ప్రైవేటు లే అవుట్‌ను, స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రాలలోని ఖాళీ ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఆయా ప్రదేశాల్లో వాహనాలను పార్క్ చేసుకోడానికి అనువైన ప్రదేశాలుగా గుర్తించారు. ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి సామర్లకోటలోని జగనన్న లే అవుట్‌లో సామూహిక గృహ ప్రవేశాల్లో పాల్గొని, అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బహిరంగ సభలో పాల్గొనడానికి ఏర్పాటు చేస్తున్నారు. ఎస్పీ వెంట ఏఎస్పీ శ్రీనివాసు, సీఐలు అబ్దుల్ నబీ, కె.దుర్గాప్రసాద్, ఎస్సైలు అడపా గరగారావు, కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

19న జార్జిపేట సర్పంచ్ ఎన్నిక

కాకినాడ సిటీ: జిల్లాలో తాళ్లరేవు మండలం జార్జిపేట సర్పంచ్ పదవితో పాటు వార్డు సభ్యులకు పెదపూడి మండలం కాండ్రేగుల, సామర్లకోట మండలం వేట్లపాలెం, చంద్రపాలెం, పెద్దాపురం మండలం దివిలి, గొల్లప్రోలు మండలం కొడవలి, ప్రత్తిపాడు మండలం గుజ్జనపూడి తదితర వార్డు సభ్యులకు ఈ నెల 19న ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి 1 గంట వరకు ఎన్నికలు జరుగుతాయి. అనంతరం మధ్యాహ్నం నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుందని అధికారులు వివరించారు.

సజావుగా ఓటర్ల జాబితా సర్వే



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జులై 21వ తేదీన బీఎల్‌వోలతో చేపట్టిన ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే జిల్లాలో అత్యంత పారదర్శకంగా, సజావుగా సాగుతోందని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ కోర్టు హాలులో డీఆర్వో కె.శ్రీధర్ రెడ్డితో కలసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే జిల్లాలో 79.76 శాతం మేర ఇళ్ల సర్వే పూర్తయినట్లు తెలిపారు. 1,634 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఇంటింటి సర్వే జరుగుతోందని, ఈ సర్వే వివరాలను ప్రతి వారం జరిగే సమావేశాల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందిచడం జరుగుతుందని, ఏమైనా సందేహాలున్నా నివృత్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 16వ తేదీ నాటికి చూస్తే 13,04,396 ఓటర్ల వివరాల పరిశీలన పూర్తయినట్లు తెలిపారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.జగన్నాథంతో పాటు వివిధ పార్టీ ప్రతినిధులు ఆర్.వెంకటేశ్వరరావు, తుమ్మల రమేష్, పి.రవికిరణ్, కె.వీరబాబు, ఎస్.అప్పారావు, ఎం.రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వావాను కలసిన కలెక్టర్, ఎస్పీ

కాకినాడ సిటీ: జిల్లాకు వచ్చిన జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావాను కాకినాడ రాయల్ పార్కు హోటల్ వద్ద కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీరితో పాటు సాంఘిక సంక్షేమ శాఖ జేడీ డీవీ రమణమూర్తి ఉన్నారు.

వినాయక అతిథిగృహానికి రంగులు



అతిథిగృహం లోపల గోడలకు వేసిన రంగులు

అన్నవరం: స్టేట్ బ్యాంక్ చైర్మన్ దినేష్ ఖర రాకతో రత్నగిరిపై సత్యదేవుని దేవస్థానంలో వినాయక అతిథిగృహం కొత్త కళను సంతరించుకుంది. ఈ అతిథి గృహానికి రంగులు, హంగులు సమకూరాయి. దేవస్థానమే ఇవన్నీ చేసిందని అనుకుంటే పొరపాటే. స్టేట్‌బ్యాంక్ అధికారులే తమ సొంత ఖర్చులతో ఈ పనులు చేయించారు. సాధారణంగా దేవస్థానంలో భవనాలకు రెండేళ్లకు ఒక సారి రంగులు వేయిస్తారు. అది కూడా టెండర్లు పిలిచి లోయెస్ట్ టెండర్ ఖరారు చేసి వేయిస్తారు. కాగా స్టేట్‌బ్యాంక్ చైర్మన్ పర్యటన ఖరారవ్వడంతో స్టేట్ బ్యాంకు అధికారులు అతిథిగృహం బయట, లోపల గదుల్లో రంగులు వేయించడంతో పాటు గోడలకు అందమైన వాల్‌పేపర్లు అతికించారు. అతిథి గృహంలో కొత్త ఫ్రిజ్‌లు ఏర్పాటు చేశారు. డైనింగ్ హాలును అందంగా తీర్చి దిద్దారు. దినేష్ ఖరకు అల్పాహారంలో 20 రకాల టిఫిన్లు, పది రకాల పండ్లు, పది రకాల జ్యూస్‌లు, ఐస్‌క్రీంలు, డ్రింక్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వినాయక అతిథిగృహం రంగులతో సుందరంగా కనువిందు చేస్తోంది.

నేటి నుంచి పంచారామ క్షేత్రంలో సామూహిక వ్రతాలు



బాలత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో శ్రావణశుక్రవారాల్లో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. నాలుగు శుక్రవారాల్లోనూ సామూహిక వ్రతాలు నిర్వహించాలని ట్రస్టు బోర్డు నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 18, ఆగస్టు 25, సెప్టెంబంబరు 1, సెప్టెంబరు 8వ తేదీల్లో వచ్చే శుక్రవారాల్లో సామూహిక వ్రతాలను నిర్వహించనున్నట్టు ఈఓ డి. నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు తెలిపారు. తోరాలు, రూపులు, ఆకులు, చెక్కలు, కొబ్బరి కాయలు, అరటి పండ్లు, గ్లాసు, ప్లేట్లు, పువ్వులు, లక్ష్మీదేవి ఫొటో ఇవ్వడానికి దాతలు ముందుకు వచ్చారని ఆయన తెలిపారు. వ్రతాలు చేసుకునే మహిళలు కేజీన్నర బియ్యం, కలశ పాత్ర, జాకెట్టు ముక్క మాత్రమే తీసుకు రావలసి ఉంటుందన్నారు. వ్రతాలు నిర్వహించే పురోహితులకు దేవస్థానం నుంచి రుసుం చెల్లించనున్నామని ఆయన తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న మహిళలు ప్రతి శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆలయంలో నిర్వహించే సామూహిక వ్రతాలకు హాజరు కావాలన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్టు ఈఓ తెలిపారు.

పాడి రైతులకు రుణాలు



అమీనాబాదులో జగనన్న పాలవెల్లువపై అవగాహన కల్పిస్తున్న వెటర్నరీ డాక్టర్ శ్రీమన్నారాయణ

కొత్తపల్లి: జగనన్న పాల వెల్లువ కేంద్రాలకు పాలు పోసే పాడి రైతులుకు ప్రభుత్వం రుణాలను మంజూరు చేస్తుందని పశువైద్యాధికారి శ్రీమన్నారాయణ అన్నారు. మండలంలోని కొండెవరం, కొత్తపల్లి, అమీనాబాదు గ్రామాల్లోని జగనన్న పాల వెల్లువ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం పాడి రైతులకు పాలవెల్లువ కేంద్రాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలో 10 జగనన్న పాల వెల్లువ కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ఈ కేంద్రాల ద్వారా ప్రతిరోజూ 250 లీటర్ల పాలు సేకరిస్తున్నట్టు చెప్పారు. ఈ కేంద్రాలకు పాలు పోసే రైతులకు రెండు గేదెలు ఉంటే ఒక్కో గేదెకు రూ.45 వేలు చొప్పున రుణాలు మంజూరు చేస్తారన్నారు. ప్రభుత్వం రైతులకు సమీకృత దాణాను 50 శాతం సబ్సిడీపై అందిస్తోందన్నారు. పాడి రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పలువురు పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



కొత్తపల్లిలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తపల్లి: మండలంలోని నాగులపల్లి, కొత్తపల్లి, కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని చిన్నారులు, విద్యార్థులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. జాతీయ నులి పురుగుల నిర్మూలనలో భాగంగా 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నాగులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సౌజన్య మాట్లాడుతూ పిల్లలు, కిశోర బాలలకు కడుపులో నులిపురుగులు ఉంటే తిన్న ఆహారం వంటబట్టదన్నారు. పోషకాహార లోపం, రక్తహీనతతో నీరసంగా ఉంటారని తెలిపారు. పిల్లలు ఈ మాత్రలను వేసుకోవడం వల్ల నులి పురుగులు నశించి పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న మేనేజర్ సాగర్

పెద్దాపురం: ప్రతిభ గల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న విద్యాజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని దివిలి కెనరా బ్యాంక్ మేనేజర్ సాగర్ అన్నారు. మండలంలోని చంద్రమాంపల్లి హైస్కూల్ విద్యార్థులకు మంజూరైన స్కాలర్‌షిప్‌ను గురువారం ఆయన అందజేశారు. బీఎం మాట్లాడుతూ విద్యార్థులు తమలోని ప్రతిభను కనబర్చి ఉత్తమ ఫలితాలు సాధించాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రీనివాస్, హిమబిందు, వైఎస్సార్ సీపీ నాయకులు వాసిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు



చిట్టోడితోట ప్రాంతంలో మురుగుకాలువను పరిశీలిస్తున్న కమిషనర్ కృష్ణవేణి

పిఠాపురం: పట్టణంలోని చిట్టోడితోట ప్రాంతంలో మురుగునీరు రోడ్లపై నిలిచి పోతోంది. స్థానికులు సమస్యను ఎమ్మెల్యే పెండెం దొరబాబు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఆదేశాలతో మున్సిపల్ అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. రజకపేట, చిట్టోడితోట, మంగయ్యమ్మరావుపేట తదితర ప్రాంతాల్లో రోడ్లపై మురుగు నీరు నిలిచి పోవడంతో దోమలు, క్రిమికీటకాలు పెరిగి అనారోగ్యం పాలవుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన మున్సిపల్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు అధికారులను డ్రైన్లను శుభ్రం చేశారు. ఆ ప్రాంతంలో డ్రైన్‌లు మూసుకుపోవడం వల్ల మురుగు నీటి సమస్య ఏర్పడిందని, దానికి శాశ్వత పరిష్కారంగా కొత్త డ్రైన్ల నిర్మాణం చేపట్టామని మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి తెలిపారు. త్వరలోనే డ్రైన్ల నిర్మాణం పూర్తి చేసి భవిష్యత్తులో మురుగు నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. కొన్ని చోట్ల కల్వర్టుల నిర్మాణాలు చేపట్టామని, ఎంత వర్షం వచ్చినా నీరు రోడ్లపైకి రాకుండా గట్టి చర్యలు తీసుకున్నామని ఆమె వివరించారు.

చేయూత లబ్ధిదారులతో ముఖాముఖి



జగనన్న చేయూత లబ్ధిదారులతో మాట్లాడుతున్న చంద్రకళాదీప్తి

కాకినాడ సిటీ: నగరంలోని 6వ వార్డు పేర్రాజుపేట గవర్నమెంట్ స్కూల్‌లో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు జగనన్న చేయూత లబ్ధిదారులతో గురువారం ముఖాముఖి నిర్వహించారు. కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సేవాదళ్ కాకినాడ స్మార్ట్ సిటీ అధ్యక్షుడు నల్లబిల్లి సుజాత, మాజీ కార్పొరేటర్లు, అధికారులు, సచివాలయం, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవునికి ఎస్‌బీఐ చైర్మన్ పూజలు



సత్యదేవుని వ్రతమాచరిస్తున్న ఎస్‌బీఐ చైర్మన్ దినేష్ ఖరే దంపతులు

అన్నవరం: స్టేట్‌బ్యాంక్ చైర్మన్ దినేష్ ఖర దంపతులు గురువారం రత్నగిరిపై సత్యదేవుని వ్రతమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి స్వామివారి వ్రతకథను హిందీలో వ్రతపురోహితులు చలపతి, రాజ్యం రామయ్య వివరించారు. సాధారణంగా సత్యదేవుని వ్రతాన్ని తెలుగులోనే నిర్వహిస్తారు. తెలుగు భాష రాని వారి కోసం దేవస్థానంలో హిందీ, ఒడియాలో వ్రతకథ చెప్పే పురోహితులు ఉన్నారు. స్వామివారి దర్శనం అనంతరం దినేష్ ఖర దంపతులకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్ పట్టువస్త్రాలు, సత్యదేవుని ఫొటో, ప్రసాదాలను బహూకరించారు. సత్యదేవుని భక్తుల కోసం రూ.30 లక్షలు విలువ చేసే 32 సీటెడ్ బస్సును దేవస్థానానికి స్టేట్‌బ్యాంక్ చైర్మన్ దినేష్ ఖర అందజేశారు. వారి వెంట ఎస్‌బీఐ సీజీఎం ఎస్.నవీన్ కుమార్, డీజీఎం ఎస్.ప్రమోద్ కుమార్, ఆర్‌ఎం సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ చైర్మన్‌కు సత్కారం

శ్రీలలితా రైస్ ఇండస్ట్రీని దేశంలోనే అగ్రగామి సంస్థగా తీర్చిదిద్దిన ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు మట్టే సత్యప్రసాద్, మట్టే శ్రీనివాస్ అత్యుత్తమ పారిశ్రామిక వేత్తలు అని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ దినేష్ ఖర ప్రశంసించారు. గురువారం అన్నవరం దేవస్థానానికి వచ్చిన ఎస్‌బీఐ చైర్మన్‌ను మట్టే సోదరులు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ చైర్మన్ వారిని బ్యాంక్ తరపున అభినందిస్తూ షీల్డ్‌ను బహూకరించారు. శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మట్టే ఆదిశంకర్, మట్టే ఆదిత్య కృష్ణన్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్‌లో రూ.50 కోట్ల పెట్టుబడి

స్టేట్‌బ్యాంక్ మ్యూచువల్ ఫండ్స్‌లో రూ.50 కోట్లను మట్టే సత్యప్రసాద్, మట్టే శ్రీనివాస్ పెట్టుబడి పెట్టారు. ఈ మేరకు గురువారం చెక్కును బ్యాంక్ చైర్మన్ దినేష్ ఖరకు అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్ చంద్ర ఝా, డీజీఎం ఎస్.ప్రమోద్ కుమార్, ఆర్‌ఎం సురేష్ బాబు, స్థానిక బ్రాంచ్ బీఎం రఘురామ్ పాల్గొన్నారు.